క్లుప్తంగా

ఎస్సీ హాస్టల్ తనిఖీ



భోజనాన్ని పరిశీలిస్తున్న జిల్లా అధికారి జాకీర్‌హుస్సేన్

గుర్రంకొండ : స్థానిక ఎస్సీ హాస్టల్‌ను జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ మరియు సాధికారిత అధికారి జాకీర్‌హుస్సేన్ తనిఖీ చేశారు. మంగళవారం స్థానిక హాస్టల్లో ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని రుచి చూసి పరిశీలించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ రాబోయే పబ్లిక్ పరీక్షల్లో బాగా రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలన్నారు. ప్రణాళిక ప్రకారం చదివితే మంచి మార్కులు సాధించవచ్చన్నారు. క్రమం తప్పకుండా ప్రతినెలా విద్యార్థులకు డాక్టరు చేత ఆరోగ్య పరిక్షలు చేయించాలన్నారు. కార్యక్రమంలో హస్టల్ వార్డెన్ శంకరప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలి



రక్తదానం చేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

మదనపల్లె సిటీ : రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలని ఆర్టీసీ డిపో -2 మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపో కార్యాలయంలో రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వారోత్సవాలను పురస్కరించుకుని సిబ్బంది రక్తదానం చేసినట్లు తెలిపారు. సేవా కార్యక్రమాలు మరిన్ని చేస్తామన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి డి.ఆర్.జగదీష్, బ్లడ్ బ్యాంకు వైద్యాధికారి అమరావతి, సిబ్బంది పాల్గొన్నారు.

దాతల సహకారం ఆదర్శనీయం

గుర్రంకొండ : పాఠశాలకు విద్యాసామగ్రిని విరాళంగా అందజేసిన దాతల సహకారం అందరికీ ఆదర్శనీయమని డీఈఓ వై. రాఘవరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని నడిమికండ్రిగ పంచాయతీ మొటుకు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలకు ఇదే గ్రామానికి చెందిన గోవర్ధన్‌రెడ్డి అనే దాత రూ. లక్ష విలువ చేసే డెస్కులు, టేబుళ్లు, కుర్చీలను పాఠశాలకు విరాళంగా అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలకు దాతలు విద్యాసామగ్రి విరాళంగా అందజేయడం అభినందనీయమన్నారు. మండల ఆర్బీకే చైర్మన్ జయచంద్రారెడ్డి, దాత గోవర్ధన్‌రెడ్డి, సర్పంచ్ సుబ్బమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు కంటి పరీక్షలు



ఆర్టీసీ ఉద్యోగులకు కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

పీలేరు : స్థానిక ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న ఉద్యోగులకు ఉచితంగా కంటి వైద పరీక్షలు నిర్వహించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మౌర్య కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో డాక్టర్ మౌర్యరెడ్డి సుమారు 50 మందికి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ డ్రైవర్లు మంచి కంటి చూపు కలిగి ఉండాలన్నారు. దృష్టి లోపం లేకుండా ఎప్పటికప్పుడు కంటి పరీక్షలు చేయించుకుంటే కళ్లను సంరక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎం కుమార్, సీఐ ధనుంజయలు, ఎస్టీఐ సుధాకర్‌నాయక్, బస్టేషన్ మేనేజర్ రెడ్డెప్ప, ఏడీసీలు కె.కె. నాయుడు, హనీఫ్ పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

వాల్మీకిపురం : స్థానిక శ్రీ షిరిడిసాయి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్టు చైర్మన్, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం 9గంటలకు స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో తిరుపతి అరవింద్ కంటి ఆసుపత్రి సహకారంతో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరానికి వచ్చే వారు ఆధార్‌కార్డు తమ వెంట తెచ్చుకోవాలని సూచించారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

8 మందిపై కేసు నమోదు

నిమ్మనపల్లె : మండలపరిధిలోని అగ్రహారం పంచాయతీకి చెందిన వ్యక్తిపై దాడిచేసిన ఘటనలో 8 మందిపై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ ఫాతిమా తెలిపారు. అగ్రహారం గ్రామం మంచి గుంటపల్లెకు చెందిన నరేంద్రను అదే గ్రామానికి చెందిన దేవేంద్ర, భాస్కర, వెంకటరమణ తదితరులు జనవరి 8న దారి విషయమై గొడవపడి దాడిచేసినట్లు తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పారదర్శకంగా అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి, పీడీ ధనలక్ష్మి తదితరులు

మదనపల్లె : తంబళ్లపల్లె, వాల్మీకిపురం, మదనపల్లె, పుంగనూరు ఐసీడీయస్ ప్రాజెక్ట్ పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలకు సంబంధించి 63 పోస్టులకు 98 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మంగళవారం సబ్ కలెక్టరేట్‌లో ఆర్డీఓ ఎం.ఎస్.మురళి, జిల్లా ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్.లక్ష్మీ, ఆయా ప్రాజెక్టుల సీడీపీఓల ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు పారదర్శకంగా నిర్వహించారు. తంబళ్లపల్లె ప్రాజెక్టు పరిధిలో 6 అంగన్‌వాడీ వర్కర్లకు 17మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. 19మంది హెల్పర్ పోస్టులకు 12 మంది దరఖాస్తు చేసుకున్నా ఇంటర్వ్యూలకు ఒక్కరూ హాజరుకాలేదు. వాల్మీకిపురం ప్రాజెక్ట్ పరిధిలో 3 అంగన్‌వాడీ వర్కర్లకు ఆరుగురు, 5 అంగన్‌వాడీ హెల్పర్లకు ఇద్దరు అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. పుంగనూరు ప్రాజెక్ట్ పరిధిలో అంగన్‌వాడీ వర్కర్లు 3 ఖాళీలకు 11మంది, హెల్పర్లు 3ఖాళీలకు ఆరుగురు హాజరయ్యారు. మదనపల్లె ప్రాజెక్ట్ పరిధిలో 7 అంగన్‌వాడీ వర్కర్ల ఖాళీలకు 40మంది, 16 హెల్పర్ల పోస్టులకు 15 మంది, 1 మినీ అంగన్‌వాడీ కార్యకర్తకు 1 చొప్పున హాజరయ్యారు. ఆర్డీఓ ఎం.ఎస్.మురళి, ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ ధనలక్ష్మి మాట్లాడుతూ..ఇంటర్వ్యూల్లో ఎంపికైన అభ్యర్థులు స్త్రీశిశు సంక్షేమ శాఖ ద్వారా సేవలను అందించి అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన గర్భిణులు, బాలింతలు, పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని కోరారు. అంగన్‌వాడీ నిర్వహణతో పాటు అదేవిధంగా విధులను సక్రమంగా నిర్వర్తించాలని తెలిపారు. ఇంటర్వ్యూలలో సీడీపీఓలు సుజాత, నాగవేణి, భారతి, రాజేశ్వరి పాల్గొన్నారు.

ప్రాధాన్యత క్రమంలో రైతులకు విద్యుత్ సర్వీసులు

డీఈ రాజశేఖర్‌రెడ్డి

నిమ్మనపల్లె : విద్యుత్ సర్వీసులకు దరఖాస్తు చేసుకున్న రైతులకు ప్రాధాన్యత క్రమంలో సర్వీసులు మంజూరు చేస్తున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ డీఈ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయంలో ఏఈ వసంత్‌కుమార్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రెండురోజుల క్రితం నిమ్మనపల్లె సబ్‌స్టేషన్ ఎదుట ఓ పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు ధర్నా నిర్వహిస్తూ విద్యుత్‌శాఖపై చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. మండలంలో రైతులకు పూర్తిస్థాయిలో 9గంటలు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. విద్యుత్‌లైన్లు, యంత్రసామగ్రి మరమ్మతుల సమయంలో మాత్రమే కోతలు ఉంటున్నాయన్నారు. అధికార పార్టీకి చెందిన వ్యక్తులకే ప్రాధాన్యత ఇస్తున్నామనడం వాస్తవం కాదన్నారు. నగదు చెల్లించి దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకు పారదర్శకంగా విద్యుత్ సర్వీసులు ఇస్తున్నామన్నారు. సమస్యలు ఉంటే ఫోన్ నెంబర్.9440811758 కు ఫిర్యాదు చేయాలన్నారు. విద్యుత్ సర్వీసుల మంజూరుకు ఎలాంటి సిఫారసులు అవసరం లేదన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి రైతుల సహకారం అవసరమన్నారు.

జగనన్న పక్కా గృహ నిర్మాణాలపై సమీక్ష



మాట్లాడుతున్న ఎంపీపీ మహమూద్

పెద్దతిప్పసముద్రం : స్థానిక మండల పరిషత్ కారాయలయంలో మంగళవారం జగనన్న పక్కా గృహ నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్న, ఎంపీడీవో గిరిధర్ రెడ్డి, తహశీల్దార్ విద్యాసాగర్, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు మండలంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో సమీక్ష చేశారు. వారు మాట్లాడుతూ అవినీతి రహిత పాలన అందించే దిశగా సచివాలయం సిబ్బంది చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. పక్కా గృహాల నిర్మాణాలను వేగవంతం చేయాలని, గృహాలు మంజూరై ఇంత వరకు నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులతో మాట్లాడి పనులు ప్రారంభించేలా చూడాలన్నారు. వారానికోసారి ఆయా గ్రామాల కార్యదరుశలు సిబ్బందితో సమీక్షించి ప్రగతి నివేదికలపై చర్చించాలన్నారు. గృహాలు మంజూరై స్వంత స్థలాలు ఉన్న వారికి తక్షణం పొజీషన్ ధృవీకరణ పత్రాలను అందజేయాలన్నారు.

గ్రామీణ ప్రాంత సమస్యల పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్

వాల్మీకిపురం : గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ వెంకట్రమణ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవంలో వైస్ ఎంపీపీ వెంకట్రమణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. అనారోగ్య కారణాలతో ఎంపీపీ అరుణమ్మ సమావేశానికి గైర్హాజరయ్యారు. వైస్ ఎంపీపీ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, పరిశుభ్రత తదితర అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం వివిధ శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ మండల అభివృద్ధే లక్ష్యంగా అందరం కలసి పని చేద్దామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నిర్మల, తహసీల్దార్ ఫిరోజ్ ఖాన్, ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్, వైస్ ఎంపీపీ కిరణ్ కుమార్, సింగల్ విండో అధ్యక్షులు రామక్రిష్టారెడ్డి, సర్పంచ్ గంగులమ్మ, మండల ప్రత్యేక ఆహ్వానితులు నాగరాజ, ఉపసర్పంచ్ కేశవ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ భవన్‌ను మాజీ సైనికుల సంఘానికి అప్పగించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న మాజీ సైనికుల సంఘం సభ్యులు

మదనపల్లె : ప్రభుత్వ ఆధీనంలో ఉన్న మదనపల్లె మాజీ సైనిక సంఘానికి చెందిన సైనిక్ భవనాన్ని అసోసియేషన్‌కు తిరిగి అప్పగించాలని సభ్యులు తహసీల్దార్ సీకే.శ్రీనివాసులకు విన్నవించారు. మంగళవారం మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ సీకే.శ్రీనివాసులును కలిసి తమ అభ్యర్థనను పరిశీలించాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కంచర్లశ్రీనివాసులు మాట్లాడుతూ.. సైనిక్ భవనాన్ని మాజీ సైనికుల సంఘానికి అప్పగించాల్సిందిగా హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందన్నారు. అయినప్పటికీ రెవెన్యూ అధికారులు భవనాన్ని అప్పగించలేదన్నారు. కార్యక్రమంలో మాజీ సైనికులు నారాయణ, సుబ్బారాయుడు, సుధాకర్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు



లక్కీడిప్ తీస్తున్న డిప్యూటీ సీటీఎం అబ్రహం

మదనపల్లె సిటీ : ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తామని ఆర్టీసీ ఉమ్మడి జిల్లా డిప్యూటీ సీఎంఈ అబ్రహం అన్నారు. మంగళవారం స్థానిక వన్ ఆర్టీసీ డిపో కార్యాలయంలో మదనపల్లె-తంబళ్లపల్లె, మదనపల్లె-బి.కొత్తకోట మార్గంలో ప్రయాణికుల కోసం గిఫ్టస్కీమ్ కింద లక్కీడిప్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల కండీషన్ మెరుగుపరిచినట్లు తెలిపారు. పాత బస్సులను కొత్తగా రూపుదిద్దుతున్నట్లు తెలిపారు. లక్కీడిప్ నందు మదనపల్లె-బి.కొత్తకోట మార్గంలో మాలతి, తక్షణ, సత్యనారాయణ, మదనపల్లె-తంబళ్లపల్లె మార్గంలో కృష్ణారెడ్డి, అమరనాథ రెడ్డి, జయప్రకాష్‌రెడ్డిలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం నిరంజన్, సీఐ రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.

వేలంలో రూ.4.35 లక్షల ఆదాయం



చేపల చెరువులకు వేలం నిర్వహిస్తున్న అధికారులు

నిమ్మనపల్లె : చేపల చెరువుల వేలంలో వెంగంవారిపల్లె పంచాయతీకి రూ.4.35లక్షల ఆదాయం సమకూరినట్లు ఎంపీడీఓ లీలామాధవి తెలిపారు. మంగళవారం వెంగంవారిపల్లె సచివాలయం వద్ద సర్పంచ్ జి.శ్రీవాణి ఆధ్వర్యంలో 17 చేపల చెరువులకు వేలం నిర్వహించారు. 20మంది పాటదారులు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొన్నారు. గరిష్టంగా రాగిమాకులచెరువును సైదాపేటకు చెందిన సాముద్దీన్ రూ.76వేలకు వేలంలో దక్కించుకున్నాడు. 17 చెరువులకు గాను రూ.4,35,200 ఆదాయం వచ్చాయన్నారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు మహమ్మద్‌రఫీ, వైఎస్సార్ సీపీ నాయకులు నవీన్, బోరెడ్డిశ్రీనివాసులురెడ్డి, శ్రీనివాసులు, రామకృష్ణ, పంచాయతీకార్యదర్శి వెంకటరమణారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌బీమా సద్వినియోగం చేసుకోవాలి

కలకడ : ప్రభుత్వం ఉచితంగా మంజూరు చేస్తున్న వైఎస్సార్ బీమాను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ నారాయణ, సర్పంచ్ ప్యారీజాన్ కోరారు. మంగళవారం మండలంలోని కలకడ ఇందిరమ్మ కాలనీలో షేక్ సైపుల్లా మృతి చెందాడు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.లక్ష బీమాలో రూ. పదివేల నగదును మృతుని భార్య యాస్మిన్‌కు అందజేశారు. కార్యక్రమంలో షావత్‌అల్లీఖాన్, ఎంఈఓ మునీంద్ర నాయక్, ఏపీఎం రమేష్, జిలానీబాషా, కార్యదర్శి నందిని తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందితో డీఎల్‌డీఓ సమీక్ష

పెద్దతిప్పసముద్రం : మండలంలోని రాపూరివాండ్లపల్లి, రంగసముద్రం సచివాలయాలను డివిజినల్ డెవలప్‌మెంట్ అధికారి (డీఎల్‌డీవో) లక్ష్మీపతి మంగళవారం తనిఖీ చేశారు. ఆయనతో పాటు ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డిలు సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. విధుల పట్ల అలసత్వం విడనాడాలని, సమయ పాలన పాటించాలని, ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సచివాలయ సేవలను పెండింగ్‌లో లేకుండా పూర్తి చేసి ప్రజలతో మమేకం కావాలని హితబోధ చేశారు.

నవోదయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా పద్మావతి

మదనపల్లె సిటీ : జవహర్ నవోదయ విద్యాలయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా పద్మావతి మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. నవోదయ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాశయ్య పదవీ విరమణ చేశారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో నవోదయ విద్యాలయ మాజీ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్‌రావు మాట్లాడుతూ కాశయ్య సేవలు ప్రశంసనీయమన్నారు.

ఉచితంగా హెచ్‌ఐవీ నిర్ధారణ పరీక్షలు

మదనపల్లె సిటీ : మదనపల్లె డివిజన్ పరిధిలోని మదనపల్లె, వాల్మీకిపురం, కలికిరి, ములకలచెరువు, అంగళ్లు ప్రాంతాల్లో ఆర్‌ఆర్‌ఎస్ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా హెచ్‌ఐవీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. హైరిస్కు వారికి పరీక్షలు చేశారు. అలాగే క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించారు. కార్యక్రమంలో ఆర్‌ఆర్‌ఎస్ మేనేజర్ పురుషోత్తం, పల్లవి, శ్వేత, గిరిజ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

కలకడ : మండలంలో ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన హసన్‌బాషాపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐసిటి స్వామి తెలిపిన వివరాలిలా.. ఆదివారం రాత్రి కలకడ టౌన్ కాలువగడ్డ వీధికి చెందిన అబ్దుల్ జబ్బార్ కుమారుడు టీఎస్ మహమ్మద్‌ను అదే గ్రామానికి చెందిన సయ్యద్‌సాహెబ్ కుమారుడు హసన్‌బాషా రాతితో కొట్టి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు మంగళవారం నిందితునిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


సారా ఊట ధ్వంసం

ములకలచెరువు : ములకలచెరువు సర్కిల్ పరిధిలోని పెద్దమండ్యం, తంబళ్లపల్లె మండలాల్లో వేర్వేరు చోట్ల సారా ఊట ధ్వంసం చేసినట్లు ఎస్ఈబీ సీఐ మల్లిక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తంబళ్లపల్లె మండలం కోటకొండ ఎగువ తండా సమీపంలో 300 లీటర్లు, పెద్దమండ్యం మండలం ఎన్‌ఓపీ తండా సమీపంలో 500 లీటర్ల సారా ఊట గుర్తించి ధ్వంసం చేసినట్లు సీఐ వెల్లడించారు.

అమ్మవారికి పంచలోహ హారాలు వితరణ

వాల్మీకిపురం : స్థానిక శ్రీ నల్లవీర గంగాభవాని అమ్మవారి ఆలయానికి పట్టణానికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు రెడ్డి కిరణ్ కుటుంబంరూ.50వేలు విలువ చేసే పంచలోహ ఆభరణాలను అమ్మవారికి వితరణ చేశారు. మంగళవారం ఈ అభరణాలను ఆలయ కమిటీ చైర్మన్ మొర్రంరెడ్డి రాం కుమార్‌రెడ్డికి దాతలు అందించారు. దాతల కుటుంబాన్ని ఆలయ కమిటీ చైర్మన్ అభినందించారు. అనంతరం ఆభరణాలను అమ్మవారికి అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దాతల కుటుంబ సభ్యులు రెడ్డికిషోర్, రెడ్డెప్ప, సభ్యులు ఆనంద శెట్టి, వెంకటరమణా రెడ్డి, బలరాం, రవీంద్ర, విజయ్‌కుమార్,వేణు, ఆలయ పూజారి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజినేయస్వామి విగ్రహం అందజేత..



ఆంజినేయస్వామి విగ్రహాన్ని అందజేస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి దంపతులు

గుర్రంకొండ : వాల్మీకిపురం శ్రీనల్లవీర గంగాభవానీ ఆలయ కమిటీ చైర్మన్ మొరంరెడ్డి రామ్ కుమార్‌రెడ్డి పురాతనమైన పంచలోహ అంజినేయస్వామి విగ్రహాన్ని మండలంలోని టి.రాచపల్లెలో నూతనంగా నిర్మించిన వీరాంజినేయస్వామి ఆలయానికి అందజేశారు. గ్రామంలో ఇటివల వీరాంజినేయ స్వామి ఆలయాన్ని రూ. 50 లక్షలతో నిర్మించారు. ఆలయానికి అవసరమైన ఉత్సవ విగ్రహాన్ని రామ్‌కుమార్ రెడ్డి తన సొంత నిధులు వెచ్చించి మంగళవారం ఆలయానికి విరాళంగా మాజీ సర్పంచ్ మహాత్మారెడ్డికి అందజేశారు. ఆలయ ఉత్సవాల్లో భాగంగా ఈ ఉత్సవ విగ్రహాన్ని వినియోగించనున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మహాత్మారెడ్డి, రమేష్, సుబ్రమణ్యం, జనార్ధన్‌స్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉచిత కేన్సర్ శిబిరానికి స్పందన



ఉచిత కేన్సర్ వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

రామసముద్రం : మండలంలోని చెంబకూరు పంచాయతీ కేంద్రంలోని ఆర్యావైశ్య వాసవి కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కేన్సర్ వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. నాగరాజశాస్త్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరానికి తిరుపతి స్విమ్స్ వైద్యశాల సిబ్బంది హాజరయ్యారు. దాదాపు 87 మంది కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో పంచాయతీ కార్యదర్శి మునస్వామి నాయక్, సర్పంచ్ రమణమ్మ, ఇతర సర్పంచ్‌లు ఎంపీటీసీ విశ్వనాథరెడ్డి, నాయకులు తిప్పారాజు, అశోక్ పాల్గొన్నారు.

• వైభవంగా శ్రీవారి పుష్పయాగం



శ్రీవారి పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

తంబళ్లపల్లె : మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. అర్చకులు క్రిష్ణప్రసాద్‌బట్టార్, రాఘవేంద్ర స్వామి, రమేష్‌బాబులు స్వామివారికి సాంప్రదాయబద్ధంగా స్నపన తిరుమహోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం పలు రకాల పుష్పాలతో అలంకరించి పుష్పయాగం నిర్వహించారు. కార్యక్రమాలు భక్తులను అలరింపచేశాయి. కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మీ, ఆలయ ఇన్స్‌పెక్టర్ రెడ్డిభాస్కర్, సర్పంచు విజయలక్ష్మీ, ఎంపీటీసీ సభ్యురాలు శ్యామలమ్మ, కోటిరెడ్డి, రఘునాథ్, శంకర్‌రెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• శ్రీరామ అవతారంలో శ్రీలక్ష్మీ జనార్ధనస్వామి



శ్రీరామ అవతారంలో స్వామి వారు

రామసముద్రం: మండల కేంద్రంలో వెలసిన శ్రీలక్ష్మీ జనార్ధనస్వామి బ్రహ్మరథోత్సవంలో భాగంగా మంగళవారం స్వామివారు శ్రీరామ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారధి భట్టర్, కులశేఖర్‌భట్టర్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.సాయంత్రం స్వామివారికి ఉంజలసేవ నిర్వహించారు. రాత్రి ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

• ఘనంగా విరూపాక్షమ్మ విగ్రహప్రతిష్ట



పీలేరు రూరల్ : మండలంలోని దొడ్డిపల్లె పంచాయతీ బంగారు అంచు బలిజపల్లెలో నూతనంగా నిర్మించిన విరూపాక్షమ్మ దేవి ఆలయంలో విగ్రహప్రతిష్టను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం ఉదయం ఆలయంలో యోగపూజ, మహాగణపతి హోమం, దుర్గా హోమం, నవగ్రహ హోమం, శాంతి హోమం, కళాహోమం, పూర్ణాహుతి, మహాకుంభాభిషేకం, ప్రాణప్రతిష్ట, మహాభిషేకం చేపట్టారు. అర్చకులు శ్రీనివాస దీక్షితులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయధర్మకర్తలు సరస్వతమ్మ, కృష్ణ, విశ్రాంత ఉపాధ్యాయులు ఎర్రయ్య, మేస్త్రీ శ్రీనివాసులు, రెడ్డిప్రసాద్, కంభం భాస్కర్‌రెడ్డి, నారే వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

కుష్టు నివారణపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న వైద్యాధికారి కీర్తి

వాల్మీకిపురం : కుష్టువ్యాధి వంశపారం పర్యం కాదని, ఎవరికైనా రావచ్చునని నగరిమడుగు వైద్యాధికారి కీర్తి, చింతపర్తి వైద్యాధికారి మానస తెలిపారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో కుష్టు నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్పర్శలేని పెద్ద మచ్చలను త్వరగా గుర్తించి, చికిత్సను పొందాలని సూచించారు. ఫిబ్రవరి 13వ తేదీ వరకు స్పర్శ లెప్రసీ అవేర్‌నెస్ ప్రోగ్రాంను గ్రామాల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే చింతపర్తిలో వైద్యాధికారి మానస ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు సుధాకర్, పూర్ణమ్మ, శికామని, ఏఎన్‌ఎంలు మౌనిక, సరోజ, క్రిష్ణవేణి, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె: మండలంలోని ప్రజలు కుష్టు నివారణపై అవగాహన పెంచుకోవాలని సీహెచ్‌వో సుమతి తెలిపారు. మంగళవారం బాలిరెడ్డిగారిపల్లె, తంబళ్లపల్లెలో కుష్టు నివారణపై అవగాహన కల్పించారు. శరీరంపై స్పర్శ మచ్చలు ఉంటే ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేసుకోవాలని సూచించారు.

బాలసదనం ఆకస్మిక తనిఖీ



బాలసదనంలో పిల్లలకు ఆధార్‌కార్డులు ఇప్పించాలని సూపరింటెండెంట్‌ను ఆదేశిస్తున్న పీడీ ధనలక్ష్మి

మదనపల్లె : పట్టణంలో స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న బాలసదనాన్ని ఇన్‌చార్జ్ పీడీ ధనలక్ష్మి మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఆశ్రయం పొందుతున్న అనాథలు, పేద పిల్లలకు అందిస్తున్న వసతులపై సిబ్బందిని ఆరా తీశారు. పిల్లలలో అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం, నిబంధనల ప్రకారం అందించాల్సిన సౌకర్యాలు కల్పిస్తున్నారా లేదా అనే విషయమై పిల్లలను అడిగి తెలుసుకున్నారు. బాలసదనంలోని సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకుని పరిష్కారం దిశగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. బాలసదనంలోని పిల్లలందరికీ ఆధార్‌కార్డులు చేయించాలన్న ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా కార్డులు ఇప్పించాలన్నారు. సమీపంలోని సచివాలయాల వద్దకు పిల్లలను తీసుకెళ్లి ఆధార్ కేంద్రాల్లో నమోదు వీలైనంత త్వరగా చేయించాలని సూపరింటెండెంట్ ఉమారాణిని ఆదేశించారు. పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధకనపరిచి, ప్రభుత్వం వారి కోసం అందిస్తున్న అన్ని పథకాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ సుజాత, బాలసదనం సిబ్బంది పాల్గొన్నారు.